క్లుప్తంగా

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయమందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని చొంపి గ్రామంలో పొద్దు లక్ష్మణ గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందారు. ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆదేశాల మేరకు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు గ్రామాన్ని సందర్శించి, లక్ష్మణ భౌతిక దేహం వద్ద నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థికసాయమందించారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం నుంచి రావల్సిన సాయం అందేలా చూస్తామన్నారు. అనంతరం పలువురు పాత్రికేయులు నివాళులర్పించారు. పార్టీ యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్, వైస్ ఎంపీపీ రామన్న, సర్పంచ్ సుభద్ర, ఎంపీటీసీ సభ్యుడు భీమరాజు, నాయకులు జీన బందు, నర్సింగ్, నగేష్, గెన్ను పాల్గొన్నారు.

నేడు విత్తనాల పంపిణీ

రాజవొమ్మంగి: స్థానిక రైతు భరోసా కేంద్రం వద్ద బుధవారం ఉదయం 10.30 గంటలకు ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా వరి విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్టు వ్యవసాయాధికారి రమేష్‌నాయుడు తెలిపారు. ముందుగా రిజిస్టర్ చేసుకున్న రైతులు ఆయా ఆర్బీకేల్లో 90 శాతం రాయితీపై వరి విత్తనాలు పొందవచ్చన్నారు.

వెలుగు ఏపీఎంగా కళావతి



పెదబయలు: మండల వైఎస్సార్ క్రాంతి పథకంలో ఏపీఎంగా చిట్టపులి కళావతి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. పాడేరు మండలంలో ఏపీఎంగా పనిచేస్తూ ఇటీవల జరిగిన బదిలీల్లో వచ్చారు. పెదబయలులో పనిచేసిన వంతాల ఈశ్వరబాబు నాయుడు పాడేరు మండలానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 16 గ్రామ సచివాలయాలు, 23 గ్రామ పంచాయతీల పరిధిలో 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్క మహిళకు స్వయం సహాయక సంఘాల్లో చేర్పించడానికి కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం మహిళ సంఘాలకు పెద్ద ఎత్తున ప్రోత్సాహిస్తోందని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రుణాల వసూళ్లలో ఏ గ్రేడ్ సంఘాలుగా తీర్చిదిద్దుతానన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న జెడ్పీటీసీ సభ్యురాలు

అరకులోయ రూరల్: మండలంలోని పద్మాపురం పంచాయతీ ప్రధానిపుట్టు గ్రామంలో జెడ్పీటీసీ సభ్యురాలు శెట్టి రోషిణి మంగళవారం సందర్శించారు. స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో తాగునీటి సమస్య ఉన్నట్టు తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర చొరవ, సర్పంచ్ సుస్మిత సహకారంతో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇందులో భాగంగా గ్రామంలో బోరు ఏర్పాటుచేయనున్నట్టు చెప్పారు. పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు అశోక్, ఎంపీటీసీ సభ్యురాలు కుమారి తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం



విద్యార్థులకు యోగాసనాలపై శిక్షణ ఇస్తున్న అధ్యాపకులు

అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ భరత్‌కుమార్ నాయక్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు యోగాపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాతో ఆరోగ్యం పొందవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ యోగా చేయడం దినచర్యలో ఓ భాగంగా అలవర్చుకోవాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ పీవోలు నాగబాబు, విజయలక్ష్మి, పుష్పరాజు, అనితకుమారి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యం దిశగా సంక్షేమ పాలన



చింతగొంది గ్రామంలో స్థానికులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



బంగారుమామిడి గ్రామంలో స్థానికులకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

జి.మాడుగుల: గాంధీజీ కలలుగన్న స్వరాజ్యం దిశగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సారథ్యంలో సంక్షేమ పాలన సాగుతోందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి చెప్పారు. మండలంలో వంతాల సచివాలయంలో చింతగొంది, గంటరాయి, సిరిపురం గ్రామాల్లో మంగళవారం ఆమె గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో 98 గడపలను ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి సందర్శించి, స్థానికుల సమస్యలను ఆమె అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ జగనన్న ప్రవేశపెట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామాల్లో ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని, పరిష్కరించే అవకాశం కలిగిందన్నారు. ప్రజాప్రతినిధులు పదవులకు పరిమితం కాకుండా ప్రజా సేవకులగానే ఉండాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి భావించినట్టేగానే తామంతా పనిచేస్తున్నామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైస్ ఎంపీపీ కుడుముల సత్యనారాయణ, మండల సచివాలయ కన్వీనర్ కళ్యాణ్, సర్పంచ్ సీదరి కొండబాబు, ఎంపీటీసీ సభ్యుడు గబ్బాడి సన్యాసిదొర, సచివాలయ కన్వీనర్లు మహేష్‌బాబు, రమణమూర్తి, గృహ సారథులు మాధవీరాణి, సింహాచలం, వార్డు సభ్యురాలు రాజులమ్మ, నాయకులు బాలకృష్ణ, వెంకటేష్ పడాల్, రాంబాబు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

పెదబయలు: పేదల సంక్షేమం, వారిని ఆర్థిక బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని కిముడుపల్లి పంచాయతీ కిముడుపల్లి, బంగారుమామిడి గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 203 గడపలను సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ సంక్షేమ పథకాలను ఎలాంటి మధ్యవర్తులు లేకుండా నేరుగా లబ్ధిదారులకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తున్నారన్నారు. కొన్ని దశాబ్దాలుగా కనీసం రోడ్డుకు నోచుకోని గ్రామాలు జగనన్న ప్రభుత్వంలో అనూహ్య అభివృద్ధి జరిగిందని, తారురోడ్ల నిర్మాణంతో పాటు, పోడుభూములకు పట్టాలు పంపిణీ జరుగుతోందన్నారు. కిముడుపల్లి పంచాయతీ పర్యాటకంగా అభివృద్ధికి కృషి చేశామని, ఇందులో భాగంగా పర్యాటక ప్రదేశం ఎండ్రిక పర్వతం సమీపంలో ఉన్న పులిగొంది గ్రామం వరకు తారురోడ్డు నిర్మాణం జరిగిందని, భవిష్యత్తులో మరింతగా అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అన్ని గ్రామాలకు సీసీ రోడ్లు, ఇంటింటికీ తాగునీరు అందించనున్నట్టు తెలిపారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలు గుర్తించి, మద్దతు తెలియజేయాలని కోరారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి జర్సింగి సూర్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు కూడ బొంజుబాబు. సర్పంచ్ కొర్ర సుధారాణి, ఎంపీటీసీ సభ్యుడు అప్పారావు, మాజీ వైస్ ఎంపీపీ వంతాల శాంతి, మాజీ సర్పంచ్ విశ్వనాథ, నాయకులు రాజారావు, ఏసుబాబు, కనకరాజు, సింహాచలం, అప్పారావు, భూపతి నాయుడు, గాసన్న, గోపాలరావు, బాలరాజు, టిమ్రు నాయుడ తదితరులు పాల్గొన్నారు.

రుణాల రికవరీలో వీఓఏలు బాధ్యత వహించాలి



వీఓఏలతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ఏపీఎం ఆదినారాయణరావు

రాజవొమ్మంగి: డ్వాక్రా సంఘ సభ్యులు తీసుకొన్న వివిధ రకాల రుణాల రికవరీలో వీఓఏలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని వెలుగు ఏపీఎం ఆదినారాయణరావు అన్నారు. ఆ దిశగా సంఘాలకు చెందిన లీడర్లను మోటివేట్ చేయాలని ఆదేశించారు. మంగళవారం స్త్రీశక్తి భవనంలో వెలుగు వీఓఏలతో (యానిమేటర్స్‌తో) సమీక్షా సమావేశం నిర్వహించి డీసీబీ (డిమాండ్, కలెక్షన్, బాలెన్స్) అంశంపై చర్చించారు. ఏపీఎం ఆదినారాయణరావు వివిధ రుణాల బకాయిల వివరాలు సేకరించారు. రుణాల మంజూరు, బకాయిల వివరాలను రికార్డు చేయాలన్నారు. కమ్యూనిటి ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్, వైఎస్సార్ సున్నా వడ్డీ రుణాలు, విలేజి ఆర్గనైజేషన్ ఫండ్, హెచ్‌డీ రుణాలు, స్త్రీనిధి, ఉన్నతి (టీఎస్పీ), వాటర్‌షెడ్ రుణాల వివరాలు పరిశీలించారు. సీసీలు ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సకాలంలో ధ్రువపత్రాలు మంజూరు చేయాలి

వై.రామవరం: రంపచోడవరం, చింతూరు ఐటీడీఏ పరిధిలో గ్రామాల్లోని గిరిజన విద్యార్థులకు సకాలంలో ధ్రువీకరణ పత్రాలు మంజూరు కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని ఆదివాసీ చైతన్య వేదిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వెదుళ్ల లచ్చిరెడ్డి చెప్పారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ధ్రువీకరణ పత్రాలు గడువులోగా అందకపోవడంతో విద్యాలయాల్లో పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు అవస్థలు పడుతున్నారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి సకాలంలో ధ్రువీకరణ పత్రాలు మంజూరయ్యేలా చూడాలని కోరారు.

జగనన్న సురక్షపై అవగాహన



దుంబ్రిగుడలో మాట్లాడుతున్న ఎంపీపీ బాక ఈశ్వరి, జెడ్పీటీసీ జానకమ్మ



చింతపల్లి సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఆశాజ్యోతి

దుంబ్రిగుడ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంపై ఏజెన్సీలోని అన్ని ప్రాంతాల్లో గ్రామ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, గ్రామ వలంటీర్లు, వీఆర్వోలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతీ ప్రభుత్వ సంక్షేమ ఫలం అర్హులందరికీ తక్షణమే అందించడమే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజాసమస్యలు అడిగి తెలుసుకోవడంతో పాటు వివిధ ధ్రువీకరణ పత్రాలు అవసరం ఉన్న వారిని గుర్తించి వివరాలు నమోదు చేయాలన్నారు. గ్రామ సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో ఇంటింటా పర్యటించి సేకరించిన డేటాను నెలాఖరులోగా సచివాలయాల్లో అప్పగించాలని యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. అనంతరం జులై 1 నుంచి గ్రామాల్లో మండల స్థాయి అధికారులు అందుబాటులోనికి వెళతారన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహణలో గ్రామసభల కోసం రెండు బృందాల నియమిస్తామన్నారు. గుర్తించిన సమస్యలను పరిష్కరించేందుకు జులై ఒకటవ తేదీ నుంచి రెండు బృందాలు 20 సచివాలయాలు సందర్శించి పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. సమస్యలు తెలుసుకుని 24 గంటల్లో సమస్యలను పరిష్కరించేలా ఉద్యోగులు పనిచేయాలన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. దుంబ్రిగుడలో ఎంపీపీ బాక ఈశ్వరి, జెడ్పీటీసీ జానకమ్మ, వైస్ ఎంపీపీ ఆనందరావు, ఎంపీడీవో ఉషారాణి, తహసీల్దార్ నాగమ్మ పాల్గొన్నారు.

అనంతగిరిలో.. ఎంపీడీవో ఎ.వి.వి.కుమార్, తహసీల్దార్ రాంబాయి తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరులో.. ఎంపీడీవో లాలం సీతయ్య, తహసీల్దార్ తిరుమలరావు, ఈవోఆర్‌డీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లిరూరల్: చింతపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో ఆశాజ్యోతి, తహసీల్దార్ లచ్చపాత్రుడు, ఈవోపీఆర్‌డీ శ్రీనివాస్, ఏవో శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగిలో.. ఎంపీడీవో యాదగిరీశ్వరరావు, తహసీల్దార్ వై.వి.సుబ్రహ్మణ్యాచారి, వెలుగు ఏపీఎం ఆదినారాయణరావు పాల్గొన్నారు.

అడ్డతీగలలో... ఎంపీడీవో కె.బాపన్నదొర, తహసీల్దార్ తాతారావు తదితరులు పాల్గొన్నారు.

వై.రామవరంలో.. తహసీల్దార్ శ్రీనివాస్, డీటీ కె.సుధాకర్, పంచాయతీ కార్యదర్శి మధుసూదనరాజు తదితరులు పాల్గొన్నారు.

గంగవరంలో.. తహసీల్దార్ శ్రీమన్నారాయణ, ఎంపీడీవో బి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందు



లాగరాయి గ్రామంలో మేకలకు నట్టల నివారణ మందు వేస్తున్న సిబ్బంది

రాజవొమ్మంగి: మండలంలోని లాగరాయి, కింద్ర గ్రామాల్లో మంగళవారం మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందు (డీ వార్మింగ్) పంపిణీని చేసినట్టు వెటర్నరీ డాక్టర్ తరుణ్ తెలిపారు. తొలిరోజు 200 మేకలు, గొర్రెలకు మందు వేశామన్నారు. క్షేత్రాలకు వచ్చే తమ సిబ్బందికి రైతులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోము వెంకట లక్ష్మి, సర్పంచ్ మిరియాల గణలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి విరాళం



లూథరన్ పాఠశాల యాజమాన్యానికి విరాళం అందజేస్తున్న సర్పంచ్ మురళీకృష్ణ

రాజవొమ్మంగి: జడ్డంగిలోని లూథరన్ ఎయిడెడ్ పాఠశాల అభివృద్ధికి సర్పంచ్ కొంగర మురళీకృష్ణ మంగళవారం రూ.5వేల విరాళం అందజేశారు. అలాగే పాఠశాలలో విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమాల్లో భాగంగా జేవీకే పాఠ్యపుస్తకాలను చిన్నారులకు అందజేశారు. ఉపాధ్యాయుడు శ్రీనివాస్, వలంటీర్ మల్లిబాబు, పొన్నాలు పాల్గొన్నారు.

చేతిపంపుల ఏర్పాటుకు భూమిపూజ



మర్రిగూడెంలో చేతి పంపు ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీలు

కూనవరం: మండలంలో మూడు చోట్ల చేతిపంపులు ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు మంగళవారం భూమిపూజ నిర్వహించారు. చినార్కూరు పంచాయతీలో చినార్కూరు, వెంకన్నగూడెం గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామస్తులు ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి దృష్టికి తాగునీటి సమస్యను తీసుకు వెళ్లగా రెండు చేతి పంపులు మంజూరు చేశారు. అలాగే మర్రిగూడెం పంచాయతీలో శ్రీదేవీ ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఎంపీపీ పాయం రంగమ్మ నిధులతో ఏర్పాటు చేయనున్న బోరుకు, ఎంపీపీ పాయం గంగమ్మ, జెడ్పీటీసీ గుజ్జా విజయలు, సర్పంచ్ సున్నం అభిరామ్‌లు భూమి పూజ నిర్వహించారు. ఎంపీడీఓ ప్రేమ్‌సాగర్, సొసైటీ అధ్యక్షుడు నోముల కొండలరావు, మాజీ సర్పంచ్ మంజుల, దేవస్థానం కమిటీ చైర్మన్ హరనాథ్, సచివాలయం కన్వీనర్లు లక్ష్మణరావు, కన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆణిముత్యాలు మరింతగా రాణించాలి



చింతపల్లిలో విద్యార్థులను సన్మానిస్తున్న ఏటీడబ్ల్యూవో జయలక్ష్మి, ఎంఈవో ప్రసాద్, హెచ్ఎం కొండలరావు



అరకులో అవార్డులు అందజేస్తున్న జెడ్పీటీసీ జానకమ్మ, సర్పంచ్ శారధ,ఎంపీటీసీ వరహాలమ్మ



రంపచోడవరంలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సర్పంచ్ బొజ్జయ్య



విద్యార్థులకు నగదు, ప్రశంసాపత్రాలు అందజేస్తున్న సర్పంచ్, హెచ్ఎం తదితరులు

చింతపల్లి: జగనన్న ఆణిముత్యాలుగా ఎంపికైన విద్యార్థులు భవిష్యత్‌లో మరింతగా రాణించి ఉన్నత చదువులు, కొలువులు సాధించాలని చింతపల్లి ఏటీడబ్ల్యూవో జయలక్ష్మి అన్నారు. చింతపల్లి గిరిజన సంక్షేమ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో మండలంలోని పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు తాంగుల కళ్యాణి, నందిని, రూతులకు ప్రభుత్వ ఆదేశాల మేరకు జగనన్న ఆణిముత్యాలు అవార్డు కింద నగదు, ప్రశంసాపత్రాలను అందజేసి, సత్కరించారు. హెచ్ఎం కొండలరావు, వార్డెన్ నూకరత్నం, పీడీ వరలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దుంబ్రిగుడ: అరకు సంతబయలు గ్రామంలోని ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో మండలంలోని పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రభుత్వ ఆదేశాల మేరకు జగనన్న ఆణిముత్యాలు అవార్డు కింద నగదు, ప్రశంసాపత్రాలను జెడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ అందజేసి, సత్కరించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. సర్పంచ్ శారద, ఎంపీటీసీ సభ్యురాలు వరహాలమ్మ, ఉపాధ్యాయుడు గెన్ను తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం: మండలంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల, గెద్దాడ జెడ్పీ పాఠశాలల్లో మంగళవారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు బొరగా ప్రవీణకుమార్ దొర, వెలుగూరి సాయిమనోహర్, చుప్పల అరుణ్‌కుమార్‌రెడ్డి, తాళ్ళూరి కృపాకీర్తనలకు ప్రభుత్వ ఆదేశాల మేరకు జగనన్న ఆణిముత్యాలు అవార్డు కింద నగదు, ప్రశంసాపత్రాలను సర్పంచ్‌లు మంగా బొజ్జయ్య, వడగల ప్రసాద్ అందజేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉన్నతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. ఎంఈఓ కె.సత్యనారాయణదొర, ఏటీడబ్ల్యూవో సీహెచ్.రామతులసి, హెచ్ఎం ప్రేమ్ కుమార్, ఎంపీటీసీ సింగోజి కృష్ణకుమారి, మాజీ ఎంపీపీ అరగాటి సత్యనారాయణరెడ్డి, హెచ్ఎం నాగమణి, ఉపాధ్యాయుడు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

లెప్రసీ సర్వేపై అవగాహన



ఆశ కార్యకర్తలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి కరుణ

దుంబ్రిగుడ: కిల్లోగుడ పీహెచ్‌సీలో వైద్యాధికారి డాక్టర్ కరుణ ఆధ్వర్యంలో లెప్రసీ సర్వేపై ఆశ కార్యకర్తలు, గ్రామ వలంటీర్లకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశానుసారం ఈ నెల 26 నుంచి జూలై 16వ తేదీ వరకు గ్రామాల్లో కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించి వివరాలు సేకరించాలన్నారు. శరీరంపై స్పర్శ లేని తెల్లని మచ్చలు ఏర్పడడం తదితర లక్షణాలు కనిపిస్తు వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. హెల్త్ సూపర్‌వైజర్ జానకమ్మ సిబ్బంది పాల్గొన్నారు.

హుకుంపేట: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో కుష్టు వ్యాధి నివారణ చర్యలపై ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలకు వైద్యాధికారి డాక్టర్ సుమన అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి వచ్చే నెల 16వ తేదీ వరకు గ్రామాల్లో ఆశ కార్యకర్తలు, గ్రామ వలంటీర్లు పర్యటించి కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించాలన్నారు. వ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించి, తమకు తెలియజేయాలని సూచించారు.

రోడ్డు ప్రమాద బాధితులకు పాలు, రొట్టెల పంపిణీ



క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఆదివాసీ చైతన్య వేదిక సంక్షేమ సంఘం నేతలు

వై.రామవరం: స్థానిక సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న నలుగురు రోడ్డు ప్రమాద బాధితులకు ఆదివాసీ చైతన్య వేదిక సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు వెదుళ్ల లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో సంఘం సభ్యులు పాలు, రొట్టెలు పంచిపెట్టారు. మండల సరిహద్దు ప్రాంతమైన కొయ్యూరు మండలం, మఠం భీమవరం గ్రామ సమీపంలో గత గురువారం వ్యాన్ బోల్తా పడిన ఘటనలో ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందగా, సుమారు 20 మంది గాయపడిన విషయం తెలిసిందే. గాయపడిన వారిలో వంతల బంగారయ్య, శిరిబాల కామాక్షి, వంతల లక్ష్మి, కాకూరి లింగయ్యలు స్థానిక సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నారు. వారిని ఆదివాసీ సంఘ నేతలు పరామర్శించి, ఓదార్చారు. ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలందుతున్నట్టు క్షతగాత్రులు తెలిపారు. ఈ సందర్భంగా వారు ఆసుపత్రి సిబ్బందిని అభినందించారు. సంఘం నేతలు వెంకటేశ్వర్లు, నరసన్నదొర, రాజారెడ్డి, ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

టీబీపై అవగాహన అవసరం



గడుతూరులో అవగాహన కల్పిస్తున్న ఐసీఎంఆర్ వైద్యాధికారి కృష్ణమూర్తి

జి.మాడుగుల: మండలంలో గెమ్మెలి పీహెచ్‌సీ పరిధిలో గడుతూరు సచివాలయం పరిధిలో గ్రామాల్లో మంగళవారం ఐసీఎంఆర్ గీతం అధ్వర్యంలో టీబీ స్క్రీనింగ్, సర్వే కార్యక్రమం జరిగింది. ఐసీఎంఆర్ వైద్యాధికారి డాక్టర్ అగతంబిడి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో టీబీ స్క్రీనింగ్ సర్వే నిర్వహించారు. టీబీ వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గ్రామ సచివాలయం పరిధిలో 20శాంపిల్స్ సేకరించినట్టు ఆయన తెలిపారు. ఏఎన్ఎంలు శాంతి, లక్ష్మి, లలిత, సిబ్బంది అనిల్, మణికుమారి, పేర్నినాయుడు, రాజు పాల్గొన్నారు.

రంపచోడవరం: పెదగెద్దాడ గ్రామంలో ప్రకృతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో క్షయ వ్యాధిపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ వడగల ప్రసాద్ మాట్లాడుతూ క్షయ లక్షణాలున్న వారు నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. వైద్యుల సూచనలు పాటిస్తే వ్యాధి నుంచి కోలుకోవచ్చన్నారు. ప్రకృతి సంస్థ డైరెక్టర్ జి.సుబ్బారాజు మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా క్షయ వ్యాధిపై గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.వ్యాధి లక్షణాలున్న వారు గ్రామాల్లో తమ కో-ఆర్డినేటర్లు ద్వారా పరీక్షలు జరిపిస్తున్నట్టు చెప్పారు. క్షయ రహిత గ్రామాలుగా తయారు చేసేందుకు సర్పంచ్‌లతో ఒప్పందం చేయిస్తున్నట్లు తెలిపారు. టీబీ ఎస్‌టీఎస్ గీతాంజలి మాట్లాడుతూ రంపచోడవరంలో ఏరియా ఆస్పత్రిలో క్షయ నిర్ధారణ పరీక్షలు చేసేందుకు అధునిక టెక్నాలజీ ఉన్నట్టు తెలిపారు. క్షయ వ్యాధి పట్ల భయం వదిలి పరీక్షలు చేయించుకోవాలన్నారు. మాజీ ఎంపీపీ సత్యనారాయణరెడ్డి, ఎంపీటీసీ సింగోజి కృష్ణకుమారి, ఎస్‌టీఎల్ఎస్ వంశీధర్, ఏఎన్ఎం సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

జేవీకే కిట్‌ల పంపిణీ



విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు అందజేస్తున్న కిరణ్‌కుమార్, పాఠశాల సిబ్బంది

అరకులోయ రూరల్: మండలంలోని పానిరంగిని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్‌లను వైఎస్సార్‌సీపీ యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు ఎల్.బి.కిరణ్‌కుమార్ మంగళవారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా విద్యార్థులకు సంక్షేమ పథకాలను అమలుచేస్తూ దేశానికి మార్గదర్శకంగా నిలిచారన్నారు. అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆదేశానుసారం కార్యక్రమంలో పాల్గొన్నట్టు చెప్పారు. హెచ్ఎంలు గాంధీపడాల్, చిట్టిబాబు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సుహాసిని, విద్యా కమిటీ చైర్మన్ కాంతారావు, వార్డు సభ్యురాలు రుక్మిణి, మాజీ వార్డు సభ్యుడు మొద్దు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

హుకుంపేట: మండలంలోని గూడ గ్రామంలో సచివాలయాన్ని జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం మంగళవారం సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. అర్హులందరికీ పథకాలు అందేలా చూడాలని సిబ్బందికి సూచించారు. అనంతరం మఠం గ్రామంలోని ఆశ్రమ పాఠశాలను సందర్శించి, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించాలన్నారు.ప్రజలకు అందుబాటులో ఉండి పూర్తిస్థాయిలో సేవలందించాలని సూచించారు. పాఠశాలల్లో మెనూ అమలుచేయాలన్నారు. మెనూ ప్రకారంగా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందజేయాలన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని, చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు.